



RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY

సామాజిక, రాజకీయ దిన పత్రిక








ప్రచురణ : నిజామాబాద్ శుక్రవారం 09-02-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 38 పేజీలు : 4 వెల : రూ 2-00


అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం

# హామీలు అమలు చేసి చూపిస్తాం



హైదరాబాద్, ఫిబ్రవరి 8 తెలంగాణ ప్రజలు వారి ఆకాంక్షలు ప్రతిబింబించేలా నిజమైన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం గల పరిపాలనను ఎన్నుకున్నారని గవర్నర్ తమిళిసై అన్నారు. గురువారం తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగా.. ఉభయ సభలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. తొలుత కాళోజీ కవితతో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్.. ఈ ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తుందని అన్నారు. ఒకప్పుడు ప్రజాభవన్‌కు అనుమతి లేని ప్రజలకు నేరుగా తమ సమస్యలు చెప్పుకునేలా సిద్ధం చేశామన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కంచెను తొలగించినట్లు గుర్తు చేశారు. ప్రజలకు మేలు చేకూరేలా ఆరు గ్యారెంటీలను అమల్లోకి అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. 'మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం. అప్పుల కుప్పగా మార్తి తమకు అప్పగించిన రాష్ట్రాన్ని పునఃనిర్మించే ప్రయత్నం చేస్తున్నాం. త్వరలోనే మరో 2 గ్యారెంటీలను అమలు చేస్తాం. అర్హులకు రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అమలు చేస్తాం. దశాబ్ద కాలంలో నష్టపోయిన సంస్థలను తిరిగి కోలుకునేలా చేస్తాం. ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతాం.' అని గవర్నర్ వివరించారు. రాష్ట్రంలో త్వరలోనే కుల గణన చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని గవర్నర్ తమిళిసై తెలిపారు. వివిధ కులాలు ముఖ్యంగా వెనుకబడిన తరగతుల సామాజిక విద్యాపరమైన ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ అవకాశాలను అంచనా వేయడానికి అవసరమైన సమాచారాన్ని ఈ ప్రక్రియ ద్వారా సేకరిస్తామన్నారు. ఇంటింటి సర్వే చేపట్టి అందరి వివరాలు సేకరిస్తామని చెప్పారు. 'సమాజంలో వివక్ష, అణచివేతకు గురైన అన్ని వర్గాలకు న్యాయం చేకూరుస్తాం... సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాలలో భాగంగా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ , పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, అమర వీరుల కుటుంబాలు, ఇతర అవసరాలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుంది.' అని పేర్కొన్నారు. బడ్జెట్ లో ప్రవేశపెట్టే ప్రతీ రూపాయి ప్రజా సంక్షేమం కోసమే ఖర్చు చేస్తామని గవర్నర్ తమిళిసై అన్నారు. 'బడ్జెట్ కేవలం ఒక ఆర్థిక పత్రం మాత్రమే కాదు.. మనం కోరుకున్న ఉమ్మడి భవిష్యత్‌కి ఒక నమూనా. ఇది మన ప్రజల ఆకాంక్షలను అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ నిబద్ధతకు ప్రతీక, బడ్జెట్‌లో నిధులను సమర్థవంతంగా కేటాయించి ఖర్చు చేసే ప్రతి రూపాయి తెలంగాణ సంక్షేమం పురోగతి దోహదపడేలా చేయడాన్ని నా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మనం ఆశిస్తున్న తెలంగాణలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతూ.. ప్రాథమిక హక్కులు పరిరక్షిస్తూ అంబేడ్కర్ స్ఫూర్తి మన కార్యచరణకుమార్గదర్శకంగాఉంటుంది. బడ్జెట్ ప్రక్రియ అనేది కేవలం వార్షిక మొక్కుబడి కాదనిగుర్తించుకోవాలి. ఇది మనం ఆశించిన అభివృద్ధికి చోదకంగా ఉంటూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఎంతో ప్రేమతో ఎన్నుకున్న ప్రజానీకపు ఆకాంక్షలను ప్రతిఫలింప జేస్తుంది.' అని తెలిపారు. నైపుణ్య విశ్వవిద్యాలయాల ఏర్పాటులో పెట్టుబడి పెట్టి, క్రీడా మౌలిక సదుపాయాలను పెంచడం ద్వారా పోటీ ప్రపంచంలో యువత రాణించడానికి అవసరమైన వృత్తిపరమైన నైపుణ్యాలతో వారిని సన్నద్ధం చేస్తామని గవర్నర్ తెలిపారు. తద్వారా క్రీడలు మన సంస్కృతిలో భాగమయ్యేట్టు చేస్తామన్నారు. 'క్రీడారంగ సమగ్ర అభివృద్ధికి తీసుకుంటున్న ప్రభుత్వ చర్యలు నిబద్ధతకు తార్కాణం. ఈ చర్యలు ద్వారా తెలంగాణలోని ఆధునిక క్రీడా సదుపాయాలను కల్పించి, స్థానిక ప్రతిభను ప్రోత్సహిస్తూ జాతీయ అంతర్జాతీయ వేదికలపై రాణిచండానికి ఔత్సాహిక అథ్లెట్లకు ఓ వేదికను ఏర్పాటు చేసే ప్రణాళికలను రూపొందిస్తాం.

# బీఏసీ మీటింగ్ వివాదం..

## హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: తెలంగాణ బడ్జెట్ సమావేశాల తొలిరోజు గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావుకు అసెంబ్లీలో వింత అనుభవం ఎదురైంది. బీఏసీ సమావేశానికి హాజరయ్యే విషయంలో ఏర్పడిన గందరగోళంపై హరీశ్‌రావు మీడియాతో చిట్‌చాట్‌గా మాటా ్లడారు.'గతంలో లేని సంప్రదాయాలు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తోంది. జాబితాలో పేర్లు ఉన్న వారు మాత్రమే బీఏసీ సమావేశానికి రావాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అంటున్నారు. కడియం శ్రీహరితో పాటు హరీశ్‌రావు బీఏసీకి వస్తారని నిన్ననే స్పీకర్‌కు బీఆర్ఎస్ఎల్పీ లీడర్ కేసీఆర్ తెలియజేశారు. స్పీకర్ రమ్మన్నారు కాబట్టే వెళ్ళాను. ఒక్క ఎమ్మెల్యే ఉన్న సీపీఐని బీఏసీ సమావేశానికి పిలిచారు' అని హరీశ్‌రావు మీడియాకు తెలిపారు. అంతకుముందు బీఏసీ సమావేశానికి వెళ్లిన హరీశ్‌రావు సమావేశం మధ్యలో నుంచే బయటికి వచ్చేశారు. జాబితాలో పేరున్న కేసీఆర్‌కు బదులుగా పేరున్న హరీశ్‌రావు బీఏసీకి వెళ్లారు. హరీశ్‌రావు బీఏసీ సమావేశానికి రావడంపై శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు అభ్యంతరం తెలపడంతో హరీశ్‌రావు మధ్యలోనే బయటికి వచ్చినట్లు తెలిసింది. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. తాము ఎవరినీ వ్యక్తిగతంగా బీఏసీ నుంచి బయటికి వెళ్లమని కోరలేదన్నారు. స్పీకర్ నిర్ణయం మేరకే బీఏసీ నడిచిందని, పార్టీల నుంచి ముందుగా ప్రతిపాదించిన సభ్యులే బీఏసీకి రావాలని స్పీకర్ కోరారని చెప్పారు. జాబితాలో పేరున్న కేసీఆర్‌కు బదులుగా హరీశ్‌రావు వస్తారని బీఆర్ఎస్ తెలిపిందన్నారు. అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై చేసిన ప్రసంగంపై అసెంబ్లీ మీడియా పాయింట్‌లో హరీశ్‌రావు స్పందించారు. ఒక విజన్‌లా ఉండాల్సిన గవర్నర్ ప్రసంగం అందరినీ నిరాశపరిచిందన్నారు. వచ్చే ఏడాది ప్రభుత్వం ఏం చేస్తుందో గవర్నర్ ప్రసంగంలో ఎక్కడా లేదని విమర్శించారు.'కొత్త ఆసరా పెన్షన్‌లు, మహిళలకు నెలకు రూ. 2500 ఎప్పుడిస్తారో తెలియని ప్రసంగం నిరాశపరిచింది. రైతులకు బోనస్, రైతు బంధు ఎప్పుడు ఇస్తారో చెప్పలేదు. నిరుద్యోగ భృతి ప్రస్తావన లేనేలేదు. ప్రజావాణి కార్యక్రమం తుస్సుమంది. మంత్రులు, ఐఏఎస్‌లు తీసుకోవాల్సిన అప్లికేషన్లు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీసుకుంటున్నారు. గవర్నర్ ప్రసంగంలో చెప్పినట్టు 2 గ్యారెంటీలు అమలవ్వడం లేదు. త్వరలో ఎన్నికల కోడ్ అమలవనుంది. అప్పుడు ఈ కొత్త హామీలు ఎలా అమలు చేస్తారు' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# కెటిఆర్‌లాగే నాకు ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతుంది: రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్: అసెంబ్లీ లాబీలో మాజీ మంత్రి కెటిఆర్, ఎంఎల్ఎ రాజగోపాల్ రెడ్డి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. మంత్రి పదవి ఎప్పుడు వస్తుందని




రాజగోపాల్ రెడ్డిని కెటిఆర్ అడిగారు. తన అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మంత్రి పదవి ఉండడంతో కెటిఆర్‌లాగే తనకు ఫ్యామిలీ ఎఫెక్ట్ పడుతుందని రాజగోపాల్ వివరణ ఇచ్చారు. కుటుంబ పాలన కాదు అని? బాగా పని చేస్తే కీర్తి ప్రతిష్ఠలు వస్తాయని కెటిఆర్ సలహా ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికలలో ఎంపిగా మీ కుమార్తె కీర్తి లేక కుమారుడు సంకీర్త్ పోటీ చేస్తారా? అని కెటిఆర్ ప్రశ్నించడంతో తన భార్య లక్ష్మి పోటీ చేసుందని? దయచేసి తనను వివాదాల్లోకి లాగవద్దని సూచించారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలను కెసిఆర్ బిజెపిలోకి పంపుతారని రాజగోపాల్ చురకలంటించారు. తనకు హోమంత్రి పదవి కావాలని అడగడంతో పాటు బిఆర్ఎస్ వాళ్లను జైలుకు పంపుతానని ఆసక్తికరంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు.

## ఎన్నికల ముందు కాంగ్రెస్‌కి బిగ్ షాక్..

### పార్టీకి గుడ్ బై చెప్పిన కీలక నేత

దాదాపు ఐదు దశాబ్దాల పాటు కాంగ్రెస్ సభ్యుడిగా ఉన్న తాను ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిక్ గురువారం తెలిపారు. ముంబై కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖ మైనారిటీ నేత, సిద్ధిక్ కాంగ్రెస్-ఎన్‌సిపి సంకీర్ణం అధికారంలో ఉన్నప్పుడు మంత్రిగా కూడా పనిచేశారు. బాబా సిద్ధిక్ కుమారుడు ప్రస్తుతం ముంబైలోని బాంద్రా (తూర్పు) నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. బాబా సిద్ధిక్ 1999, 2004, 2009లో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్నారు. సిద్ధిక్ మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి ముంబై ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ, పార్లమెంటరీ బోర్డు అధ్యక్షుడిగా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. చీ లో ఒక పోస్ట్‌లో సిద్ధిక్ ఇలా అన్నారు, "నేను యుక్తవయసులో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో చేరాను. బాబా సిద్ధిక్‌కి కాంగ్రెస్ పార్టీతో 48 ఏళ్ల అనుబంధం ఉంది. ఈ రోజు నేను భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి తక్షణమే రాజీనామా చేస్తున్నాను. ఈ ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను," అని ఆయన పేర్కొన్నారు.



# ఉభయసభలు నేటికి వాయిదా

## కాళోజీ కవితంతో చెంపదెబ్బ
## నేడు గవర్నర్ ప్రసంగంపై చర్చ
## తొలిరోజు సభకు కెసిఆర్ డుమ్మా



హైదరాబాద్,ఫిబ్రవరి8: ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగంలో కాళోజీ కవితను ప్రస్తావించిన అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు కవితతో గవర్నర్ తెలుగులో ప్రసంగాన్ని మొదలుపెట్టారు. అయితే ఆ కవితలో గత ప్రభుత్వం తీరును ఎండగడుతూ గవర్నర్ వ్యాఖ్యలు చేశారు.' అధికారమున్నదని హద్దు పద్దు లేక. అన్యాయమార్గాల నార్జింపబూనిన .అచ్చి వచ్చే రోజులంతమైనాయి .అచ్చి వచ్చే రోజులంతమైనాయి!' అంటూ గవర్నర్ ప్రసంగాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వాన్ని ఉద్దేశించి గవర్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు హాట్‌టాపిక్‌గా మారాయి. కాగా... గణతంత్ర దినోత్సవం రోజున గవర్నర్ స్పీచ్‌లో గత బీఆర్ఎస్ పాలనపై ఘాటైన విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. మరోవైపు అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డుమ్మా కొట్టారు. శుక్రవారం ధన్యవాద తీర్మానం చేయడానికి ఆయన హాజరయ్యే అవకాశమున్నట్లు సమాచారం. శస్త్ర చికిత్స చేయించుకున్న కారణంగా గత అసెంబ్లీ సమావే శాలకు కేసీఆర్ హాజరు కాలేదు.గవర్నర్ ప్రసంగం అనంతరం వాయిదా పడ్డాయి. శుక్రవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ జరుగుతుంది. శాసనసభ కార్యకలాపాల సలహాకమిటీ బీఏసీ సమావేశమై సభను ఎన్ని రోజులు నడపాలనే దానిపై నిర్ణయం తీసుకుంటుంది.. ఆర్థిక శాఖను నిర్వహించే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఫిబ్రవరి 10న బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అనంతరం బడ్జెపై సాధారణ చర్చ జరగనుంది. సమావేశాలు సుమారు 7-10 రోజుల వరకు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. బడ్జెట్‌కు ఆమోదం తరవాత వాయిదా పడుతుంది. ఇకపోతే ఆనవాయితీ ప్రకారం కాంగ్రెస్ సభ్యులు సిఎం రేవంత్ సహా అంతా కండువాలు కప్పుకుని వచ్చారు. బిఆర్ఎస్ సభ్యులు గులాబీ కండువాలతో వచ్చారు.

## కవిత వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించడమే: కొండ సురేఖ

హైదరాబాద్: టీఎస్‌పీఎస్‌సీ ఛైర్మన్ మహేందర్ రెడ్డిని తప్పించాలని కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని మంత్రి కొండ సురేఖ అన్నారు. ఆంధ్ర వ్యక్తిని నియమించారని మాట్లాడటం చూస్తుంటే..దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. పదేండ్లు పాలన చేసిన వాళ్లు రెండు నెలల పాలనపై విమర్శలు చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. పొరుగు రాష్ట్రాల కాంట్రాక్టులను పెంచి పోషించినది కేసీఆరేనని అన్నారు. మహేందర్ రెడ్డి అవినీతి అధికారి అయితే బీఆర్ఎస్ పాలనలో డీజీపీగా ఎందుకు పెట్టారు? అని నిలదీశారు.సింగరేణిలో ఉద్యోగాలు ఇస్తే తప్పుపడుతున్నారు కానీ బీఆర్ఎస్ దళారులు సింగరేణిలో ఉద్యోగాలు పొందారని ఆరోపించారు. నిరుద్యోగులకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదని అన్నారు. మహేందర్ రెడ్డి మీలాగా లిక్కర్ స్కామ్, పేపర్ లీక్ చేశారా? లేక ఒకే రూమ్ లో కావాల్సిన వాళ్లకు పరీక్షా రాయించారా? అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగాలు ఇవ్వలేదు.. తాము ఇస్తుంటే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.సింగరేణి నిధులు, ఉద్యోగాలు ఎవరు తన్నుకుపోయారో అందరికి తెలుసని కొండ సురేఖ అన్నారు. సింగరేణిలో డిప్యూటేషన్, బదిలీలకు లెటర్లు ఇచ్చి ఎంత దండుకున్నావ్.. లెక్కలు తీయాలా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల కోసమే ఈ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవదని జోస్యం చెప్పారు.



# రైతుల భారీ నిరసన..

## అడ్డుకున్న పోలీసులు



ఢిల్లీ: వందలాది మంది రైతులు నిరసన తెలుపుతూ.. పార్లమెంట్ వరకు చేపట్టిన ర్యాలీని నోయిడాలోని మహామాయ ఫ్లైఓవర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు పెట్టిన బారికేడ్స్‌ను దాటడానికి రైతులు ప్రయత్నించారు.అయితే నోయిడాలోని పలు గ్రామాల రైతుల తాము పార్లమెంట్ బయట తమ డిమాండ్ల కోసం నిరసన తెలుపుతామని ప్రకటించారు. తాము ట్రాక్టర్లు, బస్సులతో రాజాధాని ఢిల్లీకి నిరసనగా ప్రవేశిస్తామని తెలిపారు. వారంతా మహామాయ ఫ్లైఓవర్ వద్దకు చేరుకొని ఢిల్లీవైపు బయలుదేరుదామని నిర్ణయించుకున్నారు. కాగా.. ఒక్కసారిగా వందలది మంది రైతులు తమ వాహనాలతో గుమిగూడటంతో ట్రాఫిక్ అంతరాయంతో పాటు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. దీంతో పోలీసులు రైతులను ర్యాలీ ముందుకు వెళ్లకుండా బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. నివాస అవసరాల కోసం సేకరించిన మొత్తం భూమిలో 10 శాతం, 64.7 శాతం పెంచిన భూ పరిహారం, రెసిడెన్షియల్ ప్లాట్‌లపై వాణిజ్య కార్యకలాపాలకు అనుమతి, ఇతర ప్రయోజనాల కోసం తమ డిమాండ్లను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పరిష్కరించడం లేదని భారతీయ కిసాన్ ఏక్తా సంఘ్ నాయకుడు సుఖ్‌బీర్ యాదవ్ మండిపడ్డారు. తమ డిమాండ్లను పరిష్కరించాలనే ఉద్దేశంతో రైతులమంతా పార్లమెంట్ వద్దకు నిరసన ర్యాలీ చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

# రైల్వే కౌంటర్లలలో యూపీఐ పేమెంట్స్

ముంబై, ఫిబ్రవరి 8, (న్యూస్ పల్స్) రైలు ప్రయాణికుల సౌకర్యం కోసం కొత్త పాలసీ తీసుకొచ్చింది దక్షిణ మధ్య రైల్వే. టికెట్ కౌంటర్ల దగ్గర డిజిటల్ పేమెంట్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికుల కష్టాలతో పాటు టికెట్ కౌంటర్ దగ్గర రైల్వే సిబ్బంది పడుతున్న బాధలను అర్థం చేసుకుని... ఈ నిర్ణయం తీసుకుంది. రైల్వే టికెట్ కౌంటర్లలో డిజిటల్ చెల్లింపులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి. దీంతో.. ఇకపై టికెట్ కొనేందుకు చిల్లర కోసం వెతుక్కోవాల్సిన పనిలేదు. డిజిటల్ పేమెంట్ ద్వారా టికెట్ కొనుక్కోవచ్చు. అంతేకాదు... రైల్వే కౌంటర్లలో డెబిట్, క్రెడిట్ కార్డులతో చెల్లింపులు చేయొచ్చు. దక్షిణ మధ్య రైల్వే తీసుకున్న ఈ నిర్ణయం... మధ్యతరగతి ప్రజలకు ఊరట నిస్తోంది. సుదూర ప్రాంతాలకు ప్రయాణించాలంటే మధ్యతరగతి వారు ఎంచుకునేది రైలు ప్రయాణమే. అయితే రైలు టికెట్ల బుకింగే కొంచెం కష్టం. ముందస్తు ప్లాన్ ఉండి... 20, 30 రోజుల ముందే టికెట్ బుక్ చేసుకుంటే పర్వాలేదు. లేదంటే చుక్కలే.



ఇక టికెట్ టికెట్ బుకింగ్ విషయానికి వస్తే... అవగాహన ఉన్న వాళ్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటారు. లేని వాళ్లు... రైల్వేస్టేషన్లలో టికెట్ కౌంటర్ల దగ్గరకు వెళ్లి.. టికెట్ రిజర్వ్ చేయించుకుంటారు. రైల్వే కౌంటర్లకు వెళ్లి... టికెట్ బుక్‌చేసుకోవాలంటే... చేతిలో డబ్బులు ఉండి తీరాల్సిందే. టికెట్‌కు సరిపడా చిల్లర లేకపోతే.. అదో సమస్య. ఇకపై అలాంటి సమస్యలు లేకుండా... సరికొత్త నిర్ణయం తీసుకుంది రైల్వే శాఖ. డిజిటల్ పేమెంట్స్ విధానం ప్రవేశపెట్టి... అటు ప్రయాణికులకు... ఇటు టికెట్ కౌంటర్‌లోని సిబ్బందికి కాస్త రిలీఫ్ ఇస్తోంది.రైల్వే స్టేషన్‌లోని అన్ని టికెట్ కౌంటర్ల వద్ద యూపీఐ పేమెంట్స్ చేయవచ్చు. అందుకోసం... టికెట్ కౌంటర్ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూపీఐ యాప్ ద్వారా చెల్లింపులు చేసేలా దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేసింది. లేదా డెబిట్, క్రెడిట్ కార్డులతో చెల్లింపులు చేసే వీలు కల్పించింది.

# సంపాదకీయం

శుక్రవారం 09-02-2024

## అడ్డదారి తొక్కుతున్న టెక్నాలజీ

డీప్ ఫేక్.. ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్న ప్రధాన అంశం. టాప్ సెలబ్రిటీల నుంచి సామాన్య ప్రజలు దీని బారిన పడుతున్నారు. సెలబ్రిటీల ఫోటోలు మార్ఫింగ్ చేయడం, వీడియోల్లో ఫేస్‌ను మార్చి అశ్లీలంగా చూపించడం, వాయిస్‌ను మార్చి ఆన్ లైన్ గేమింగ్ వంటి ప్లాట్ ఫామ్స్‌ను ప్రమోట్ చేయడం వంటివి చేస్తున్నారు. ప్రధాన మంత్రి నుంచి పల్లెల్లో నివసించే సామాన్య పౌరుల దాకా ఈ డీప్ ఫేక్ బాధితులుగా మిగులుతున్నారు. ఏఐ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినాక డీప్ ఫేక్‌ల బెడద నిత్యకృత్యమైంది. ఏఐ సాంకేతికతను ఉపయోగించి సెలబ్రిటీల ఫేస్‌లను చాలా సులభంగా మార్ఫింగ్ చేస్తున్నారు. ముఖంతో పాటు హావభావాలు, ముఖ కవలికలను అచ్చు గుద్దినట్టు దించేస్తున్నారు. దీంతో ఒరిజినల్ వీడియోలకు ఫేక్ వీడియోలకు కొంచెం కూడా తేడా లేకుండా చేస్తున్నారు. వాయిస్‌లను సైతం ఒరిజినల్‌గా మాట్లాడినట్టే సృష్టిస్తున్నారు. ఈ టెక్నాలజీని క్రియేటివ్, ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూపొందించారు. అసాధ్యం అయిన వాటిని ఈ టెక్నాలజీతో సుసాధ్యం చేసి చూపించవచ్చు. యమదొంగ అనే సినిమాలో సీనియర్ ఎన్టీఆర్ వచ్చి జూనియర్ ఎన్టీఆర్ తో స్టెప్పులు వేశాడు. ఇలా చాలా మంది నటీనటులు చనిపోయాక తెరపై తళుక్కున మెరిశారు. ఇదంతా డీప్ ఫేక్ ద్వారానే సాధ్యమైంది. వీటిని మంచి కోసం వాడినంత వరకు బాగానే ఉంటుంది. కానీ చాలా మంది కేటుగాళ్లు దీన్ని ఆసరాగా చేసుకుని ఏఐ టెక్నాలజీని ఉపయోగించి అనేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మంచికోసం తయారు చేసిన ఏఐ టెక్నాలజీని ఇతరులను మోసం చేయడానికి, సంస్థలు, ప్రభుత్వాలను మోసం చేయడానికి వినియోగిస్తున్నారుఅధ్యక్షుడు జో బైడెన్ 2020 ఎన్నికల సమయంలో పలుమార్లు డీప్ ఫేక్ బారిన పడ్డారు. మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, డొనాల్డ్ ట్రంప్ సైతం డీప్ ఫేక్ మాయాజాలంతో ఇబ్బందులు పడ్డారు. యుద్ధ సమయంలో పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సైతం సంచలన ప్రకటనలు చేసినట్లు ఈ ఫేకర్లు చాలా పుకార్లే సృష్టించారు. ఆ మధ్య ఒక జర్నలిస్టు బిల్ గేట్స్‌ను చాలా సీరియస్‌గా ప్రశ్నలు అడిగి ఇబ్బందులు పెట్టినట్లు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ అయింది. అది కూడా డీప్ ఫేక్ మాయాజాలమే. ఇటీవల చాలా మంది బాలీవుడ్, టాలీవుడ్ సెలెబ్రిటీలు వివిధ రకాల బ్రాండ్లను ప్రమోట్ చేస్తున్నట్లు వస్తున్న వార్తలన్నీ డీపీ ఫేక్ గాళ్లు చేసిన ఘన కార్యాలేడీప్ ఫేక్‌ను అరికట్టడానికి ప్రత్యేకమైన చట్టాలు తేవాల్సిన అవసరం ఉంది. బలమైన చట్టం లేకుంటే డీప్ ఫేక్‌ను తయారు చేసేవాళ్లు మరింత విచ్చలవిడిగా రెచ్చిపోయే ప్రమాదం ఉంది. దీని ప్రభావం అన్ని వ్యవస్థలపై తీవ్రంగా పడే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐటీ చట్టంలోని 66డి, 67, 67ఎ కింద కంప్యూటర్ ద్వారా మోసం చేయడం, వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించడం అనే నేరాలకు జైలు శిక్ష, భారీ జరిమానాలు విధించవచ్చు. ఐపీసీ సెక్షన్ 500 కంద పరువు నష్టం కలిగించినందుకు శిక్షించవచ్చు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే డీప్ ఫేక్ ఘటనలను అదుపు చేయడానికి కఠిన చట్టాలు తీసుకురావాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి.ఒక వీడియో, ఫొటో, స్పీచ్ చూడగానే దాన్ని నిశితంగా పరిశీలించాలి. ఫేక్ కంటెంట్ అని అనుమానం ఉంటే దాన్ని ఇతరులకు ఫార్వర్డ్ చేయకూడదు. అలాంటి మీ మొబైల్‌కు వస్తే వెంటనే డిలీట్ చేయాలి. వ్యక్తిగత ఆడియో, వీడియోలను ఇతరులకు పంపకూడదు. బ్యాంకు ఖాతాలు, లావాదేవీలు, అకౌంట్ నంబర్లను ఫోన్లలో ఎవరికీ చెప్పకూడదు. మీ ఫోన్ నుంచి సింగిల్‌గా ఉన్న ఫొటోలు షేర్ చేయకపోవడంమంచిది.మీసోషల్‌మీడియాఅకౌంట్లకు డీపీలుగా మీరు సింగిల్‌గా ఉన్న ఫొటోలు పెట్టుకోకూడదు.

# వంద శాతం కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి ..

### సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్..
### ప్రజల ముంగిట్లోకి కేంద్ర పథకాలు
### – ఎల్ డిఎం యు.నాగ శ్రీనివాస రావ్








నిజామాబాద్, ఫిబ్రవరి 08 (లోకంతీరు):– వంద శాతం లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ తెలిపారు.గురువారం నిజామాబాద్ పట్టణంలోని బోర్ గావ్ మరియు పాంగ్రా వద్ద వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఫేస్ 2 కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్ మాట్లాడుతూ....కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వంద శాతం లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అర్హులై సంక్షేమ పథకాలు లబ్ధి పొందని వారు ఉండకూడదనేది ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. క్యాలెండర్ పై ఉన్న క్యూఆర్ కోడ్ ను సెల్ ఫోన్ ద్వారా స్కానింగ్ చేస్తే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు తెలిసిపోతాయని, ఆ సదుపాయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కేంద్ర పథకాల గురించి అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పట్టణ మరియు గ్రామగ్రామాన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తోందని స్పష్టం చేశారు.ప్రజల ముంగిట్లోకి కేంద్ర పథకాలువివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి తేవడం జరిగిందని ఎల్ డిఎం యు.నాగ శ్రీనివాసరావ్ అన్నారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందాలనే అకుంఠిత దీక్షతో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆయా పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వారిచే సభలో వారి అనుభవాలను, అనుభూతులను స్వయంగా వివరింపజేశారు. అర్హులైన లబ్ధిదారులు అందరికీ పథకాల ప్రయోజనాలు అందుతాయని, అందుకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ప్రస్తుతం సంకల్ప యాత్ర ద్వారా మీ ముంగిటకు వచ్చిన అధికారులకు నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.అంతకుముందు స్థానికులతో వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలు, గోడప్రతులు, క్యాలెండర్లను ఆవిష్కరించి, ప్రజలకు పంపిణీ చేశారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సౌజన్య, బిజెపి యువ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, బ్యాంక్ మేనేజర్, డాక్టర్ లు, అగ్రికల్చర్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవలో తనకు సాటి ఎవరూ లేరు:ఎంపీ బీబీ పాటిల్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (లోకం తీరు ఫిబ్రవరి 08)అధికార దర్పం ఏమాత్రం కనిపించకుండా సాధారణవ్యక్తిగా ప్రజల్లో తిరుగుతూ తన ని ఏం పి గా గెలిపించారు. వారి రుణం ఏ విధంగా తీర్చుకోవాలో పది సంవత్సరాల్లో ఎన్నో కొత్త ప్రాజెక్టులు తెచ్చి జహీరాబాద్ పార్లమెంటు స్థానానికి వన్నెతెచ్చిన వ్యక్తి బీబీ పాటిల్ నిరూపించారు.దేశంలో ఎంతోమంది ఎంపీలు ఉన్నపటికి అంకిత భావం అవినీతి రహితంగా తన ప్రాంత అభివృద్ధి ధ్యేయంగా పనిచేశారు.అందుకు నిదర్శనం పార్లమెంట్ పరిధిలో రెండు కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేయించి మారుమూల ప్రాంతాలైన జహీరాబాద్,మద్నూర్ ప్రాంత విద్యార్థుల కు సెంట్రల్ సిలబస్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. ఇవే కాకుండా తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను కేంద్రంలో కొట్లాడి సాధించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు.అంతేకాకుండా ప్రజా సమస్యలపై అత్యున్నతమైన పార్లమెంట్లో తనదైన శైలిలో 433 ప్రశ్నల వర్షం కురిపించి ఇటు ప్రజా సమస్యల పరిష్కారం,అటు ప్రభుత్వ పెద్దల దృష్టిని ఆకర్షించి ఎన్నో పథకాలను సాధించారు. కానీ ఎలాంటి అర్భాటం లేకుండా తానేదో చేసినన్ని గొప్పలు చెప్పకుండా ప్రజల సమస్యలు పరిష్కారం అయితే తన జీవితం ధన్యమైనట్లేనని భావించే వ్యక్తుల్లో బి బి పాటిల్ తెలిపారు.తన పార్లమెంట్ నియోజకవర్గంలో నేషనల్ రూబిన్ పథకం కింద రాయక్కల్,జుక్కల్ మండలాల్లో 362. 83 కోట్లతో అభివృద్ధి చేపట్టినట్లు పేర్కొన్నారు అలాగే అమృత్ భారత్ పథకం కింద కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆధునికరణకు 39.90 కోట్లతో అలాగే జహీరాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికరణకు 24.35 కోట్లతో పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అంతే కాకుండా జహీరాబాద్ కామారెడ్డి రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల సౌకర్యం కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించినట్లు తెలిపారు.ఆదర్శ గ్రామ యోజన పథకం కింద కౌలాస్ జరా సంగం 10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు.అంతేకాకుండా నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి 86 లక్షల వ్యయంతో బిచ్కుంద,కోహినూర్,జోగిపేట్,నారాయణఖేడ్,దోమకొండ,మద్నూర్ ఆసుపత్రులకు అంబులెన్స్ కొనుగోలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉండాలని కామారెడ్డి జిల్లా కేంద్రంలో పాస్ ఫోటోఆఫీసు నెలకొల్పడం జరిగిందని అన్నారు.అలాగే మద్నూర్ పోస్ట్ ఆఫీస్ భవనం నిర్మించడం జరిగిందన్నారు.వికలాంగుల కోసం ఒక కోటి 77 లక్షలతో బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లను పంపిణీ చేయడం జరిగిందని అందులో 70 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు అయితే 30% ఎంపీ నిధులు అన్నారు.26 కోట్ల 79 లక్షలతో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కింద ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అందుకు మ్యాచింగ్ గ్రాంట్ కింద ఎంపీ నిధులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

# 16 ప్రాంతాల్లో ఫ్రీ వైఫై...



హైదరాబాద్, ఫిబ్రవరి 8 ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్క?సారలమ్మ మహాజాతర. నాలుగు రోజుల పాటు సాగనున్న ఈ జాతరకు దేశ, విదేశాల నుంచి దాదాపు కోటి మంది వరకు భక్తుల వరకు వస్తారని అంచనా.ములుగు జిల్లాలోని అటవీ ప్రాంతంలో జరిగే ఈ జాతరలో కమ్యూనికేషన్ సేవలు ఎంతో ముఖ్యం కానున్నాయి. సెల్ ఫోన్ సిగ్నల్స్ నుంచి ఇంటర్నెట్, వైఫై సేవలు చాలా కీలకం కాగా.. సరైన సిగ్నలింగ్ వ్యవస్థ లేక అక్కడికి వెళ్లే భక్తులకు తరచూ ఇబ్బందులు తలెత్తుతుంటాయి.దీంతో ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) మేడారం మహాజాతరలో మెరుగైన సేవలందించేందుకు సిద్ధమైంది. జాతరలో సిగ్నలింగ్ వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు భక్తులకు ఉచిత వైఫై సేవలందించేందుకు కసరత్తు చేస్తోంది.భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే 16 ప్రధాన ప్రాంతాల్లో అక్కడి జనాలంతా ఉచితంగా వైఫై సేవలు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు మేడారం మహాజాతరలో ఇప్పటికే యాక్షన్ స్టార్ట్ చేసింది.మేడారం మహాజాతర అటవీ ప్రాంతం నడి మధ్యలో జరుగుతుంది. ఇక్కడి భక్తులకు సేవలందించేందుకు ప్రైవేటు సంస్థలకు చెందిన ఒకట్రెండు టవర్లు ఉండగా.. బీఎస్ఎన్ఎల్ గతంలోనే ఐదు చోట్లా టవర్లను ఏర్పాటు చేసింది.వరంగల్ నుంచి మేడారం వెళ్లే మార్గంలోని పస్రా, వెంగళాపూర్, ప్రాజెక్టునగర్, నార్లాపర్, మేడారం ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద పర్మినెంట్ స్ట్రక్షర్లు ఏర్పాటు చేసింది. వనదేవతలను దర్శించుకునే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండటంతో అక్కడ సిగ్నలింగ్ సమస్యలు తలెత్తుతున్నాయి.వరంగల్ నుంచి మేడారం వరకు సెల్ ఫోన్, ఇంటర్నెట్ కనెక్టివిటీకి ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు తలెత్తకుండా మరో తొమ్మిది చోట్లా తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. వరంగల్ నుంచి మేడారం వరకు సిగ్నల్స్ అంతరాయం కలగకుండా గట్టమ్మ ఆలయం నుంచి మేడారం వరకు వీటిని అమర్చే ప్రయత్నాల్లో ఉంది.ఇందులో ములుగు సమీపంలోని గట్టమ్మ ఆలయం, ఊరట్టం క్రాస్ రోడ్డు, కొత్తూరు, రెడ్డిగూడెం, జంపన్నవాగు, కాజ్ వే, మేడారం సమ్మక్క గద్దెలు, ఆర్టీసీ బస్టాండ్, గెస్ట్ హౌజ్ వద్ద ఈ తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు దానిని సంబంధించిన పనులు పూర్తయినట్లుగా బీఎస్ఎన్ఎల్ అధికారులు చెబుతున్నారు. ఈ టవర్ల ద్వారా 2జీ, 3జీ సేవలు నిరంతరాయంగా అందించనున్న ట్లు పేర్కొంటున్నారు. భక్తులకు ఇంటర్నెట్ సేవలను అరచేతిలోకి తెచ్చేందుకు బీఎస్ఎన్ఎల్ మేడారం మహాజాతరలో 16 చోట్లా హాట్ స్పాట్ సేవలను అందుబాటులోకి తెచ్చే పనులు చేపడుతు న్నారు.ఈ మేరకు ములుగు ఎంట్రన్స్ లోని గట్టమ్మ గుడి, కొత్తూరు రోడ్, కొత్తూరు స్కూల్, ఊరట్టం క్రాస్ రోడ్డు, కాజ్‌వే, రెడ్డిగూడెం స్కూల్, హరిత హోటల్, నార్లాపూర్, ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఐటీడీఏ గెస్ట్ హౌస్, బస్టాండ్, వాచ్ టవర్, ఆసుపత్రుల వద్ద ఒక్కొక్కటి, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, మేడారం అమ్మవారి గద్దెల ప్రాంతాల్లో హాట్ స్పాట్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.ఆయా సెంటర్ల వద్ద పనులు కూడా పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ హాట్ స్పాట్ సెంటర్లకు వంద అడుగుల లోపు ఏ నెట్ వర్క్ వినియోగదారులైనా సులభంగా లాగిన్ అయి వైఫై సేవలు వినియోగించుకోవచ్చు. 10 నుంచి 20 ఎంబీపీఎస్ స్పీడ్‌తో వన్ జీబీ వరకు డేటా వాడుకోవచ్చు.గత జాతర సమయంలో ప్రభుత్వం ఈ ఉచిత వైఫై సేవల కోసం సుమారు రూ.20 లక్షల వరకు కేటాయించగా.. అంతే నిధులతో సేవలందించేందుకు ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.మహాజాతర మేడారంలో ఈ నెల 15వ తేదీ నుంచి బీఎస్ఎన్ఎల్ వైఫై సేవలు అందుబాటులోకి రానున్నా యి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరగనుండగా.. జాతర పూర్తిగా ముగిసే 25వ తేదీ వరకు వైఫై సేవలు అందుబా టులో ఉండనున్నాయి.బీఎస్ఎన్ఎల్ కు సంబంధించిన అన్ని రకాల సేవలను పర్యవేక్షించేందుకు మూడు టీములను కూడా ఏర్పాటు చేశారు. ఆయా బృందాల్లో 20 మంది అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ కనెక్టివిటీ, సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించనున్నారు.మేడారం జాతరలో ఫ్రీగా బీఎస్ఎన్ఎల్ సిమ్ము కూడా అందజేయనున్నారు. వాటిని రూ.249 ప్లాన్ తో రీఛార్జ్ చేసుకుంటే 45 రోజుల పాటు ప్రతి రోజు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్లు, అన్ లిమిటెడ్ ఔట్ గోయింగ్, ఇన్ కమింగ్ కాల్స్ సేవలు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.

## ఇంటింటికి రామయ్య ఫోటోలు




కరీంనగర్, ఫిబ్రవరి 8 (న్యూస్ పల్స్)అయోధ్యలో బాల రామయ్య కొలువుదీరిన వేళ అందరి అడుగులు రామయ్య దర్శనం కోసమే అన్నచందంగా ఉంది. తాజాగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో అయోధ్య రాముడు ప్రతి ఇంటా కొలువుదీరబోతున్నడు. ముఖ్యంగా అయోధ్యలో రామ మందిర ప్రాణ:ప్రతిష్ట ప్రారంభమైనప్పటి నుండి తెలంగాణలో ప్రత్యేకించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికులు అయోధ్య వెళ్లాలని, శ్రీరామ చంద్రుడిని దర్శించాలని ఆశిస్తున్న వారే ఎక్కువ. ఈ నేపథ్యంలో రాములోరి ప్రతి భక్తుడి ఇంటికి అయోధ్య రామయ్య రాబోతున్నడు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆధ్వర్యంలో ఇంటింటా కొలువు దీరేలా అయోధ్య రామయ్య చిత్రపటాలను తయారు చేయించారు. అందుకోసం తన పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవ ర్గాల్లో ఎంత మంది ఓటర్లున్నారు? ఎన్ని కుటుంబాలు న్నాయి? అందులో అయోధ్య రామయ్యను తలిచి కొలిచే వాళ్లెందరున్నారు? అనే వివరాలను సేకరించారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న రామయ్య భక్తుల ఇంటి ఇంటికి అయోధ్య రామయ్య చిత్ర పటాన్ని పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిని దృష్టి లో ఉంచుకుని 4 లక్షల 21 వేల 11 వందల అయోధ్య రాముడి చిత్ర పటాలను తయారు చేయించారు బండి సంజయ్.. ఇప్పటికే లక్షకుపైగా రామయ్య చిత్ర పటాలు సిద్ధం కావడంతో ఇంటింటికీ చేరవేసే పనిలో కాషాయ శ్రేణులు నిమగ్నమయ్యాయి. ఈ పంపిణీ కార్యక్రమంలో నేను సైతం అంటూ బండి సంజయ్ తో పాటు రామయ్య భక్తులు పాల్గొననున్నారు.

## శివబాలకృష్ణ అక్రమాస్తులపై ఇడి దృష్టి

### రంగంలోకి ఐటి అధికారులు

హైదరాబాద్,ఫిబ్రవరి8(): హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాస్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఈడీతోపాటు ఐటీ అధికారులు రంగంలోకి దిగనున్నారు. శివబాలకృష్ణ ఎఫ్ఐర్, రిమాండ్ రిపోర్టులను తమకు ఇవ్వాలని ఏసీబీకి ఈడీ లేఖ రాసింది. మనీలాండరింగ్ కోణంలో ఆయనను విచారించనుంది. మరోవైపు శివబాలకృష్ణ బినామీ ఆస్తులపై కూడా ఐటీ అధికారులు విచారణ చేపట్ట నున్నట్లు తెలుస్తున్నది. అధికారాన్ని ఉపయోగించుకుని భారీగా అక్రమాస్తులను కూడబెట్టిన శివబాలకృష్ణను ఏసీబీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏసీబీ కస్టడీ బుధవారంతో ముగిసింది. 8 రోజుల కస్టడీలో చేపట్టిన విచారణలో రూ.250 కోట్ల అక్రమాస్తులను గుర్తించారు. శివబాలకృష్ణ బంధువుల పేరిట 214 ఎకరరాల వ్యవసాయ భూములు రిజిస్టర్ అయినట్టు తేలిందని అధికారులు తెలిపారు. జనగామ జిల్లాలో 102, యాదాద్రి భువనగిరి జిల్లాలో 66, నాగర్‌కర్నూల్ జిల్లాలో 38, సిద్దిపేటలో 7 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు వెల్లడించారు. తెలంగాణలో 29, ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం, విశాఖపట్నంలో 3 ఓపెన్ ఎలాట్లతోపాటు రూ.30.3 కోట్ల విలువైన 7 ఎలాట్లు, 3 విల్లాలను గుర్తించినట్టు తెలిపారు. బ్యాంకు లాకర్‌లో ఉన్న 18 తులాల బంగారం, ఓ పాస్‌బుక్‌ను జప్తు చేశామన్నారు. శివబాలకృష్ణ సోదరుడు శివనవీన్‌కుమార్ అరెస్టుతో మరో నలుగురు బినామీలను గుర్తించినట్టు చెప్పారు. శివనవీన్‌కుమార్ భార్య పేరిట ఉన్న ఆస్తులపై కూడా దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు. శివబాలకృష్ణ అక్రమాల వెనుక హెచ్ఎండీఏ, మెట్రోరైల్ అధికారుల పాత్రపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

# జిల్లాలోని ఓటర్ల తుది జాబితా విడుదల- కలెక్టర్ జితేశ్వివి పాటిల్




కామారెడ్డి జిల్లా ప్రతినిధి (లోకం తీరు ఫిబ్రవరి 7)భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సెకండ్ సమ్మరి రివిజన్-2024 లో భాగంగా జనవరి 1, 2024 నాటికి అర్హత కలిగిన ఓటర్లతో కలిసి రూపొందించిన ఓటరు తుది జాబితాను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం విడుదల చేశారు. ఇట్టి తుది జాబితా మేరకు జిల్లాలో 6,77,936 మంది ఓటర్లతో పాటు 27 మంది యెన్.ఆర్.ఐ. ఓటర్లు, మరో 558 మంది సర్వీస్ ఓటర్లున్నారని కలెక్టర్ తెలిపారు. ఇందులో పురుష ఓటర్లు 3,27,724 మంది , మహిళలు 3,50,181 మంది కాగా మరో 31 మంది ఇతరులున్నారని అన్నారు. కాగా జుక్కల్ నియోజక వర్గంలో 2,01,935 మంది, యెల్లారెడ్డి నియోజక వర్గంలో 2,21,730 మంది కామారెడ్డి నియోజక వర్గంలో 2,54,271 మంది ఓటరులున్నారని అన్నారు. ఇట్టి తుది ఓటరు జాబితాను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ స్థాయి అధికారులకు అందజేయడంతో పాటు తహసీల్దారు కార్యాలయాలు, కలెక్టరేట్ లో నోటీసు బోర్డుపై ప్రదర్శించామని కలెక్టర్ తెలిపారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (లోకం తీరు ఫిబ్రవరి 8) అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది ,ఈ కార్యక్రమంలో ఎబివిపి కామారెడ్డి పట్టణ కార్యదర్శి చరణ్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న ఆడ బిడ్డల పైన జరిగే ఆగాయిత్యాలు ఆగడంలేదని అన్నారు,యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి విద్యార్థినులు, ఒకే గదిలో ఉంటున్న భవ్యశ్రీ వైష్ణవి శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడటం జరిగింది. వీరి బలవన్మరణానికి కారణమైనటువంటి వార్డెన్ ని సస్పెండ్ చేయాలి, మరియు నిందితుడు ఆటో డ్రైవర్ ఆంజనేయులు ని అదుపులోకి తీస్కొని చట్టపరమైన శిక్ష వెయ్యాలని, డిమాండ్ చేశారు, ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చెటని అన్నారు.ప్రభుత్వాలు మారుతున్న అమాయకులైనటువంటి మహిళలపై దాడులు మాత్రం ఆగడం లేదని ఏబీవీపీ వాపోయింది భాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఏబీవీపీ ఉద్యమం ఆపదని హేచ్చరించారు, అదేవిధంగా ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి సంక్షేమ హాస్టల్లో భద్రత వైఫల్యాలు చాలా ఉన్నాయి కాబట్టి ఈ సంఘటనతోనైనా ఈ యొక్క రాష్ట్ర ప్రభుత్వం సిగ్గు తెచ్చుకొని సంక్షేమ హాస్టల్లో బలోపేతం చేస్తూ విద్యార్థులకు రక్షణ ఉండాలని వారు అన్నారు .ఈ కార్యక్రమం లో జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యూష , రోహిత్ నవీన్ మానస సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో దారుణం..

**నడిరోడ్డుపై ప్రియురాలిని నరికి చంపిన ప్రియుడు**

నిర్మల్ : నిర్మల్ జిల్లాలో దారుణం జరిగింది. ఖానాపూర్ పరిధిలోని శివాజీనగర్‌లో నడిరోడ్డుపై ఓ ప్రేమికుడు బరి తెగించాడు. పెళ్లికి నిరాకరించిందని ప్రియురాలిని గొడ్డలితో నరికిచంపాడు. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# విలువలతో కూడిన రాజకీయాలు చేస్తే బాగుంటుంది

**దూషణలే చేస్తామంటే ప్రతి దూషణలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధం.**
**ప్రోటోకాల్ గురించి పోచారం మాట్లాడడం విడ్డూరంగా ఉంది.**



కొట్టం మనోహర్.బాన్సువాడ/కోటగిరి లోకం తీరు:-విలువలతో కూడిన సాంప్రదాయ రాజకీయాలను ప్రోత్సహిస్తే బాగుంటది,కాదు కూడదు అని దూషణలు చేస్తే ప్రతి దూషణలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉన్నారని డిసిసి డెలిగేట్ సభ్యులు కోటగిరి ఎంపిటిసి కొట్టం మనోహర్,నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం కోటగిరి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మాట్లాడుతూ.ఇటీవల పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన నియోజక వర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పోచారం భాస్కర్ రెడ్డి మా నాయకులు ఏనుగు రవీందర్ రెడ్డినీ గాడు గీడు అనడం సిగ్గుచేటని.డీసీసీబీ చైర్మన్ హోదాను మరచిపోయిన పోచారం భాస్కర్ రెడ్డి అపరిస్కృత పదజాలాలతో మాట్లాడటం సబబు కాదన్నారు.8 సం.లుగా ఎమ్మెల్యే చేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి పరువును కార్యకర్తలు కాకుండా కొడుకుగా మీరే పరువు తీస్తున్నారని అన్నారు.మాకు నోరు ఉంది సభ్యత మరోచితే మేము కూడా మీకంటే గొప్పగా దుషించగలుగుతామన్నారు. ముందు మీ డీసీసీబీ బ్యాంకు లో జరిగిన కుంభ కోణాలను సరిచేసుకోవాల ఆయన ఆరోపించారు.ప్రోటోకాల్ గురించి పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.ఉమ్మడి కోటగిరి మండలంలో 14 మంది ఎంపీటీసీలు ఉంటే అందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన 4 ఎంపీటీసీలకు 5 లక్షల ఫండ్స్ ఇవ్వకుండా ఏనాడు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధు లను గౌరవించకుండా నేడు ప్రోటోకాల్ గుర్తుకు వస్తుందా అనీ ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏమైనా జరిగితే ఊరుకొమని పోచారం శ్రీనివాస్ రెడ్డి వాఖ్యనించడం సరైనది కాదని.గొడవలు పెట్టుకునే సంస్కృ తి కాంగ్రెస్ పార్టీకి లేదని.బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా మా కుటుంబ సభ్యులే నని.మీ కుమారుల్లాగా విభజించి పాలించి,గొడవల వాతావరణ సృష్టించి,కేసులు పెట్టించే నీచ సంస్కృతి మా కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రెస్ మీట్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షాహిద్ హుస్సేన్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గంగాధర్ దేశాయ్,కిసాన్ కేత్ మండల అధ్యక్షుడు ఆనంద్,కోటగిరి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అఫ్జల్,సుంకిని హనుమంతు,మక్బుల్,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతున్న ఎల్.పి.జి.సర్వే- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్





కామారెడ్డి జిల్లా ప్రతినిధి (లోకం తీరు ఫిబ్రవరి 8)ప్రజాపాలన సందర్భంగా ప్రజలు సమర్పించిన ధరఖాస్తులలో గ్యాస్ కనెక్షన్ కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వివరాలను వెంటనే సేకరించి నిర్ధారిత యాప్ లో పొందుపరచవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సర్వే బృందాలను ఆదేశించారు. గురువారం జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో ఏర్పాటు చేసిన టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ అభయహస్తం క్రింద ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో ఒకటైన 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించే పథకం త్వరలో అమలు చేయాలని . యోచిస్తున్న నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిశిలించగా సరైన వివరాలు పేర్కొనలేదని గమనించి తిరిగి అట్టి వివరాలు సేకరించవలసినదిగా ఆదేశిచిందని అన్నారు. ప్రధానంగా దరఖాస్తులో గ్యాస్ ఏజెన్సీ పేరు, కన్స్యూమర్ నెంబర్, రేషన్ కార్డు నెంబర్ వంటి వివరాలను ప్రజలు సరిగా పొందుపర్చలేదని అన్నారు. అర్హులైన ఏ ఒక్కరు నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తప్పిదాలను సరిచెయుటకు ప్రత్యేక యాప్ ను రూపొందించిందని తెలిపారు. తప్పిదాలను సరిచెయుటకు ఏర్పాటు చేసిన గ్రామ, మునిసిపల్ వార్డు స్థాయి బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాలను విస్తృతంగా పర్యటించి వివరాలను సేకరించి ప్రత్యేక యాప్ లో నమోదు చేయాలని ఆదేశించారు.. ఈ సందర్భంగా యాప్ లో వివరాలు ఎలా నమోదు చేయాలో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సర్వే బృందాలు ఈ నెల 10 లోగా తప్పిదాలు నమోదు చేసిన దరఖాస్తుదారులను సంప్రదించి సమగ్ర వివరాలు సేకరించి యాప్ లో నమోదు చేసేలా, పర్యవేక్షించవలసినదిగా ఎంపిడిఓలు ఎంపీఓలు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లకు కలెక్టర్ సూచించారు. ప్రజలు కూడా సర్వే బృందాలకు సహకరించవలసినదిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. దరఖాస్తులు సక్రమంగా ఉన్న వాటికి సంబంధించి వాటి ఆమోదం నిమిత్తం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, సర్వే బృందాలు తమను సంప్రదించలేదని ఇతర దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు

# జిల్లాలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభం






కామారెడ్డి జిల్లా ప్రతినిధి (లోకం తీరు,ఫిబ్రవరి 8)కామారెడ్డి జిల్లాలో పారిశుద్ధ్య వారోత్సవాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈనెల 7 నుంచి 14 వరకు పట్టణ, గ్రామస్థాయిలో చేపట్టే పనుల వివరాలను జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందించారు. జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారుల సమన్వయంతో పారిశుద్ధ్య పనులను చేపడుతున్నారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో గ్రామ సెక్రెటరీ సాగర్ గౌడ్ పర్యవేక్షణలో రోడ్లు, మురుగు కాలువలను శుభ్రం చేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీనివాసరావు, డిఎల్పి సాయిబాబా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపేట మండలం బంజర తాండ, పెద్దకోడప్గల్ మండలం పోచారం తండాలో గురువారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పరిశుభ్రత పనులు కొనసాగుతున్నాయి. గ్రామాల్లోని మురికి కాలువలను శుభ్రం చేయించారు. పాఠశాలలు, అంగన్వాడి , ఆరోగ్య ఉప కేంద్రాలు, మార్కెట్ స్థలాలు, బస్టాండ్లు శుభ్రం చేయించారు. గ్రామాల్లో గల లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తీసివేసి, నీరు నిల్వ ఉండకుండా పూడిచి వేశారు. గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను, భవనాల పరిసర ప్రాంతాల్లో గల చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. గ్రామపంచాయతీలో అన్ని కుటుంబాలు శుక్రవారం డ్రై డే ని పాటించాలని అధికారులు సూచించారు. వాటరింగ్ డే లో భాగంగా గ్రామపంచాయతీలో గల మొక్కలకు నీటిని పోసే విధంగా చూడాలని అధికారులు తెలిపారు. మరుగునీటిని నిలువ లేకుండా చూసి, ఎక్కడైనా నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ ని ఉపయోగించాలని చెప్పారు. దోమల నివారణకు యాంటీ లార్వా, రసాయనాలు పిచికారి చేయాలన్నారు. గ్రామాలలోని తాగినీటి వనరులను అధికారులు తనిఖీ చేసి క్లోరినేషన్ చేసే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో పైప్ లైన్ లీకేజీలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కమాన్ పూర్ ,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాంస్కృతిక కళామండలి కళాకారులు పాటల రూపంలో వివరించారు.కమాన్ పూర్ మండలం పేరపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం సభ్యులచె పరిసరాల పరిశుభ్రత డ్రగ్స్ గంజాయి మాదకద్రవ్యాలు , ఆడపిల్లలని పుట్టనిద్దాం ఎదగనిద్దాం చదవనిద్ధం బేటి బచావో బేటి పడావో అని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది.మరియు ప్రభుత్వ పథకాల పైన అవగాహన కల్పించడం జరిగింది యువత పెడుతూవ పట్టకుండా మంచి మార్గంలో నడవాలని నేటి యువత 30 సంవత్సరాలు నిండకుండానే యాక్సిడెంట్లలో అనారోగ్యాలతో చాలామంది యువత మరణాలపాలవుతున్నారు తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారని నేటి యువత రేపటి దేశ భవిత అని యువతరం గ్రహించాలని తల్లిదండ్రులు కన్న కలలు నిజం చేయాలని పాటల రూపంలో అవగాహన కల్పించడం జరిగింది అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలో అమలవుతున్న రెండు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ ఆదేశాల మేరకు డి పి ఆర్ ఓ అయ్యూబ్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వారు తెలియజేశారు .ఇంకా ఈ కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు జనగామ రాజనర్సు ఈదునూరి పద్మ కోండ్ర వెంకన్న గౌడ్ ఇల్లందుల మల్లేష్ గౌడ్ జిన్నరమ సలేంద్ర రాజన్న దీకొండ శ్రావణ్ కన్నూరి రేణుక కట్కూరి శ్రీవల్లి గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది

# తుది ఓటరు జాబితాను విడుదల చేసిన కలెక్టర్.. రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేత.



Statement Showing the details of General Electors & NRI Electors as per SSR-2024 Final Electoral Roll published on 08.02.2024

| No. & Name of AC | No.of PS | General Electors (Including NRI) (08.02.2024) | | | | NRI Electors (Overseas) (08.02.2024) | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Male | Female | Others | Total | Male | Female | Others | Total |
| 011-Armoor | 217 | 98116 | 112612 | 6 | 210734 | 8 | 1 | 0 | 9 |
| 012-Bodhan | 246 | 105609 | 115701 | 4 | 221314 | 13 | 0 | 0 | 13 |
| 014-Banswada | 258 | 93266 | 102415 | 13 | 195694 | 4 | 1 | 0 | 5 |
| 017-Nizamabad Urba | 289 | 144645 | 154961 | 41 | 299647 | 8 | 1 | 0 | 9 |
| 018-Nizamabad Rura | 293 | 118607 | 135523 | 6 | 254136 | 18 | 1 | 0 | 19 |
| 019-Balkonda | 246 | 103995 | 121263 | 2 | 225260 | 25 | 5 | 0 | 30 |
| Total | 1549 | 664238 | 742475 | 72 | 1406785 | 76 | 9 | 0 | 85 |

నిజామాబాద్, ఫిబ్రవరి 08(లోకంతీరు) : ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ జాబితాను విడుదల చేసి, వారికి తుది ఓటరు జాబితాను అందజేశారు. నిజామాబాద్ జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో మొత్తం 1406785 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 85 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు ఉన్నారని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. 664238 మంది పురుష ఓటర్లు ఉండగా, 742475 మంది మహిళా ఓటర్లు, 72 మంది ఇతర ఓటర్లు ఉన్నారని తెలిపారు. 85 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లలో 76 మంది పురుషులు, 9 మంది మహిళా ఓటర్లు ఉన్నారని అన్నారు. నియోజకవర్గాల వారీగా ఓటర్లను పరిశీలిస్తే, ఆర్మూర్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 98116 పురుష ఓటర్లు, 112612 మహిళా ఓటర్లు, ఆరుగురు ఇతరులు, 9 మంది ఎన్.ఆర్.ఐలను కలుపుకుని మొత్తం 210734 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. బోధన్ శాసనసభా నియోజకవర్గం పరిధిలో 105609 మంది పురుష, 115701 మహిళా ఓటర్లు, నలుగురు ఇతరులు, 13 మంది ఎన్.ఆర్.ఐ ఓటర్లు కలుపుకుని మొత్తం 221314 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో 93266 పురుష, 102415 మంది మహిళలు, 13 మంది ఇతరులు, ఐదుగురు ఎన్.ఆర్.ఐలు కలుపుకుని 195694 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. నిజామాబాద్ అర్బన్ సెగ్మెంట్ పరిధిలో 144645 మంది పురుష ఓటర్లు, 154961 మంది మహిళా ఓటర్లు, 41 మంది ఇతర ఓటర్లు, 9 మంది ఎన్.ఆర్.ఐలు కలుపుకుని మొత్తం 299647 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో 118607 మంది పురుష ఓటర్లు, 135523 మంది మహిళా ఓటర్లు, ఆరుగురు ఇతరులు, 19 మంది ఎన్.ఆర్.ఐలను కలుపుకుని మొత్తం 254136 మంది ఓటర్లు ఉన్నారని సూచించారు. అలాగే బాల్కొండ శాసనసభ నియోజకవర్గంలో 103995 మంది పురుష ఓటర్లు, 121263 మహిళా ఓటర్లు, ఇతరులు ఇద్దరు, 30 మంది ఎన్.ఆర్.ఐలను కలుపుకుని మొత్తం 225260 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఎస్.ఎస్.ఆర్ - 2024 కార్యక్రమంలో భాగంగా జనవరి 22 వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది ఓటరు జాబితాను రూపొందించడం జరిగిందని కలెక్టర్ స్పష్టం చేశారు. తుది ఓటరు జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవెల్ అధికారుల వద్ద, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించే తహశీల్దార్ కార్యాలయాలలో, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలలో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఓటరు జాబితా విడుదల కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్, విజయేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న ఈవీఎంల ఎఫ్.ఎల్.సి ప్రక్రియ. పరిశీలించిన కలెక్టర్,






నిజామాబాద్, ఫిబ్రవరి 08 (లోకంతీరు): జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్.ఎల్.సి) ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఈవీఎం గోడౌన్ ను సందర్శించి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఎఫ్.ఎల్.సి ప్రక్రియను పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వి.వి.ప్యాట్ల పనితీరు పరిశీలన కోసం ఈ.సీ.ఐ.ఎల్ ఇంజినీర్లు నిర్వహిస్తున్న ఎఫ్.ఎల్.సి ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా ఎఫ్.ఎల్.సీ పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఎన్నికల విభాగం అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు

# సినిమా తీరు

## ఆర్ సీ 16 లోనూ చరణ్ డ్యూయల్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 16వ చిత్రం పనులు షురూ అయిన సంగతి తెలిసిందే. తన 15వ చిత్రం 'గేమ్ ఛేంజర్' షూటింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో! కొత్త సినిమా పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే ఆడిషన్ పనులు కూడా మొదలయ్యాయి.



దీనిలో భాగంగా ఈసారి ఉత్తరాంధ్ర ప్రతిభకు బుచ్చి బాబు పట్టం కట్టే పనిలో పడ్డాడు. విశాఖ.. విజయ నగరం ..శ్రీకాకుళం జిల్లాల మారుమూల ప్రాంతాల వారికి అవకావం కల్పిస్తూ స్టార్ హంట్ ని నిర్వహిస్తున్నాడు. : సింగిల్ పీస్ డ్రెస్ లో జగతి మేడం స్టన్నింగ్ ప్రతిభావంతులు ఎవరైనా తన సినిమాలో అవకాశం వినియోగించుకోవాలని కోరాడు.ఈ నేపథ్యంలో చరణ్ పాత్రకు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్ డేట్ కూడా అందింది. ఇందులో చరణ్ రెండు పాత్రల్లో కనిపించున్నాడుట. రెండు వేటికవి ప్రత్యేకంగా ఉంటాయని... ఓపాత్ర మన్యం జీవిన శైలిని పోలి ఉంటుందని అంటున్నారు. బుచ్చిబాబు ఉత్తరాంధ్ర నటుల్ని తీసుకోవడం వెనుక కూడా ఈ లాజిక్ ఉందని వినిపిస్తుంది. ఈ పాత్ర సినిమాలో ఎంతో బలంగా ఉంటుందని...మెయిన్ లీడ్ ఇదే అవుతుందని లీకైంది. మరి ఇందు లో నిజమెంతో తెలియాలి. మరోవైపు చరణ్ 'గేమ్ చేంజర్' లో కూడా డ్యూయల్ రోల్ పోషిస్తున్నాడు. శంకర్ దర్శకత్వం వహిస్తోన్న ఈసినిమా పొలిటికల్ కమ్ తనదైన మార్క్ సమాజంపై సెటైరికల్ గా సినిమా ఉంటుందని ఇప్పటికే ప్రచారం సాగుతోంది. ఈనేపథ్యంలో చరణ్ పాత్రని రెండు రకాలుగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. చరణ్ బ్యాక్ టూ బ్యాక్ చిత్రాల్లో డ్యూయల్ రోల్ పోషించడం ఆసక్తికరమే. ఇలా డ్యూయల్ రోల్ చరణ కి ప్లస్ అయితే పర్వాలేదు. ఇప్పటివరకూ చరణ్ మూడు సినిమాల్లో ద్విపాత్రాభినయం చేసాడు. తొలిసారి రాజమౌళి దర్శకత్వం వహించిన 'మగధీర'లో పోషించాడు. ఈ సినిమా అతన్ని 100 కోట్ల హీరోని చేసింది. అటుపై వి.వి.వినాయక్ దర్శకత్వం వహించిన 'నాయక్' లోనూ డ్యూయల్ రోల్ చేసాడు. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. అటుపై వంశీ పైడిపల్లితో 'ఎవడు' సినిమా చేసాడు. ఇందులో కూడా డ్యూయల్ రోల్ పోషించాడు. కాకపోతే ఒక పాత్ర కోసం బన్నీ ఫేస్ ని దించారు. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. ఆ రకంగా చరణ్ డ్యూయల్ రోల్స్ ఇంతవరకూ ఫెయిలైంది లేదు. మరి తాజా ప్రయత్నాలు ఎంతవరకూ ఫలిస్తాయో చూడాలి.

## కల్కి ఓవర్సీస్ రైట్స్.. ఆ రేంజ్ లోనా?

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ వరల్డ్ మూవీ కల్కి 2898 ఏడీ. ఈ చిత్రంలో కమల్ హాసన్ ప్రతినాయకుడిగా నటిస్తూ ఉండగా, అమితాబచ్చన్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అలాగే దీపికా పదుకునే హీరోయిన్ గా చేస్తోంది. దిశా పటాని ఓ కీలక పాత్రలో మెరవబోతోంది. భారీ క్యాస్టింగ్ తో ఈ చిత్రాన్ని నాగ్ అశ్విన్ రెండు భాగాలుగా సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు.



సింగిల్ పీస్ డ్రెస్ లో జగతి మేడం స్టన్నింగ్ మే 9న కల్కి 2898 ఏడీ మూవీ ప్రపంచ వ్యాప్తంగా 22 భాషలలో ఏకకాలంలో రిలీజ్ కాబోతోంది. ఇంగ్లీష్ వెర్షన్ కూడా అప్పుడే రానుంది. ఇండియా నుంచి ఇంగ్లీష్ మూవీస్ చాలా వచ్చాయి. అయితే మొదటి సారి హాలీవుడ్ స్టాండర్డ్స్ లో కల్కి మూవీ రాబోతోంది. అలాగే కమర్షియల్ మూవీగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గా రిప్రజెంట్ చేస్తున్నారు. ఇండియన్ మూవీ ఇండస్ట్రీలో హైయెస్ట్ బడ్జెట్ తో కల్కి తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై బిజినెస్ ని వైజయంతీ మూవీస్ స్టార్ట్ చేసిందంట. ఈ సినిమా ఓవర్సీస్ హక్కుల కోసం అశ్వినీదత్ ఏకంగా వంద కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. డిస్టిబ్యూటర్స్ 70 నుంచి 80 కోట్ల మధ్యన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారంట. అయితే వంద కోట్లు ఇస్తేనే హక్కులు ఇస్తానని నిర్మాత క్లారిటీగా చెప్పేసినట్లు టాక్. ఎవరూ అనుకున్న రేటు కోట్ చేయకపోతే సొంతంగా రిలీజ్ చేసుకోవాలని ఆలోచిస్తున్నారంట. ! ఇదే స్థాయిలో ఇండియా మొత్తం మీద బిజినెస్ లెక్కలు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్ఆర్ఆర్ కంటే ఎక్కువగా ఈ మూవీ కోసం నిర్మాత డిమాండ్ చేస్తున్నారంట. సినిమా క్వాలిటీ, కంటెంట్ స్టాండర్డ్స్ ని దృష్టిలో ఉంచుకొని ఈ స్థాయిలో అడుగుతు న్నట్లు తెలుస్తోంది. డిమాండ్ చేసే స్థాయిలో డిస్టిబ్యూటర్స్ నుంచి రాకపోతే అన్ని ప్రాంతాలలో సొంత ంగానే కల్కి చిత్రాన్ని రిలీజ్ చేసుకోవా లని నిర్మాత భావిస్తున్నా రంట. సినిమా అవుట్ ఫుట్ అద్భుతంగా వచ్చిందని ఆ నమ్మకం తోనే ఈ స్థాయిలో డేరింగ్ చేస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోంది.వేళ నిర్మాతలు అడిగినంత డిస్టిబ్యూ టర్స్ ఇవ్వడానికి ముందు కొస్తే మాత్రం ఇండియన్ సిల్వర్ స్క్రీన్ అత్యధిక బిజినెస్ జరిగిన మూవీగా కల్కి 2898 ఏడీ మారే అవకాశం ఉంటుంది.

## గుర్తుంచుకోండి, గర్భిణీ స్త్రీలు, బొప్పాయి పండ్లకు వీలైనంత దూరంగా ఉండండి!



ప్రతి స్త్రీ ప్రకృతికి బహుమతిగా ఉన్న తల్లిగా ఎంతో విలువైన క్షణం అనుభవించటం సహజం. ఈ ప్రక్రియలో, ఆ అవకాశాన్ని ఉపయోగించడం ద్వారా తల్లి అయ్యే ప్రక్రియలో స్త్రీ ఎక్కువగా బాధపడుతుంది. మానసిక మరియు శారీరక మార్పులకు గురయ్యే గర్భిణీ స్త్రీలు తమలో తాము మరొక జీవితాన్ని పెంపొందించుకోవటానికి మరియు కడుపులో బిడ్డను భూమిపైకి తీసుకురావడానికి కీలకమైన విషయం.అన్ని కష్టాలను ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్న గర్భిణీ స్త్రీ తన బిడ్డ గురించి చాలా కలలు కంటున్నది. గర్భిణీ స్త్రీలలో ఊహించని గర్భస్రావాలు ఆమె శారీరకంగా మరియు మానసికంగా మార్పులు జరుగుతాయి. ఇలాంటి గర్భస్రావం జరగడానికి చాలా కారణాలు ఉన్నాయి. కారణాలు, వెతికితే గర్భిణీ స్త్రీలలో శారీరక సమస్యలు, మహిళల్లో గర్భాశయ లోపాలు, ప్రమాదాలు, తగిన మందులు, ఒత్తిడితో కూడిన వర్కౌట్స్, అధిక శారీరక అలసట, ఆహారాలు తినే అలవాట్లు మొదలైనవి.యోగ్యత లేని ఆహారం కూడా ఊహించని గర్భస్రావాలకు కారణమవుతుంది. గర్భిణీ స్త్రీ ఆరోగ్యం కోసం శ్రద్ధ వహించడం చాలా ప్రాముఖ్యమైనది, ఆమె గర్భంలో ఉన్న పిండానికి తొమ్మిది నెలలు ఆహారం ఇవ్వడం, ఆమె పోషకాలను పోషించడం మరియు పిండాన్ని ఆరోగ్యకరమైన బిడ్డగా మార్చడం వంటి ముఖ్యమైన మరియు కష్టమైన పనిని చేస్తుంది.తల్లి అయ్యే ఈ సుదీర్ఘ ప్రక్రియలో, ఆమె తన రోజువారీ కార్యకలాపాలు అనేక అంశాలను జాగ్రత్తగా చూసుకోవాలి. వాటిలో ముఖ్యమైనది ఆహారం. ప్రతి గర్భిణీ స్త్రీలు ఆరోగ్యకరమైన మరియు సమతుల్య ఆహారాన్ని అనుసరించాలి. గర్భిణీ స్త్రీలు గర్భస్రావం జరిగితే ఏ ఆహారాలు మరియు పదార్థాలను నివారించాలో కూడా సమాచారం తెలిసికుని ఉండాలి.సరైన పోషకాహారం తినకుండా మరియు అధికంగా ఆహారం తీసుకోవడం కూడా మహిళల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది గర్భధారణ సమయంలో కొన్ని ప్రతికూల ఆరోగ్య సమస్యలు మరియు అడ్డంకులను సృష్టిస్తుందని కూడా అంటారు. ఇలాంటి అనేక కేసులను మేము విన్నాము. గర్భిణీ స్త్రీలు బొప్పాయి పండ్లు, గుడ్లు వంటి ఆహార పదార్థాలను తింటే ప్రమాదం అని చాలా మందికి తెలియదు మరియు ఇది గర్భస్రావంకు కారణం అవుతుంది. ఈ వ్యాసంలో మీరు ఏ ఆహారాలు గర్భస్రావం కలిగిస్తాయి అనే సమాచారాన్ని కనుగొంటారు ...సాధారణంగా, బొప్పాయి పండు ఒక పోషక ఆహారం మరియు ఇది చాలా వ్యాధులను నయం చేస్తుంది కూడా. బొప్పాయి గింజ శరీరంలో రోగనిరోధక శక్తిని పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జీర్ణక్రియకు సహాయం చేయడంతో పాటు, గాయాల చికిత్సలో బొప్పాయిని కూడా ఉపయోగిస్తారు. బొప్పాయి పండ్ల రసం కాలిన గాయాలు, బొబ్బలు మరియు ఇతర గాయాలకు చికిత్స చేయడానికి ఉపయోగపడుతుంది. అంతేకాక, మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులు మరియు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుండి కూడా మనల్ని మనం కాపాడుకోవచ్చు.బొప్పాయిలో ఇన్ని అద్భుతమైన ప్రయోజనాలను కలిగి ఉంది, అయితే గర్భిణీ స్త్రీలకు మరియు గర్భం పొందాలనుకునే వారికి మంచిది కాదు. బొప్పాయి పండ్లు మరియు వండని గుడ్లు గర్భస్రావం కలిస్తాయని కూడా అంటారు. అయితే, బొప్పాయి మరియు పచ్చి గుడ్లు తీసుకోవడం వల్ల గర్భస్రావం అయ్యే అవకాశం ఉంది.ఆయుర్వేదం ప్రకారం, గుడ్లు మరియు బొప్పాయి రెండూ వేడి ఆహారాలు. బొప్పాయిలోని పాల రసంలో పాపైన్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి. బొప్పాయిలోని ఈ ఎంజైమ్ ప్రోస్టాగ్లాండిన్ మరియు ఆక్సిటోసిన్ అనే మరో రెండు ఎంజైమ్‌లపై గర్భస్రావంగా పనిచేస్తాయి. ఈ ప్రోస్టాగ్లాండిన్ మరియు ఆక్సిటోసిన్ ఎంజైములు కృత్రిమంగా ఉపయోగించే ప్రసూతి శాస్త్రానికి ఉపయోగించే మాదిరిగానే ఉంటాయి. బొప్పాయిలోని ఎంజైమ్‌కు ప్రినేటల్ శ్రమ(గర్భస్రావం ) చేసే సామర్థ్యం ఉంది.అందుకే వీటిని తినడం వల్ల పుట్టబోయే బిడ్డలో అసాధారణతలు ఏర్పడతాయి.

## కల్ట్ బొమ్మకి అతి పెద్ద సవాల్ ఇది!

బాలీవుడ్ లో తెలుగు సినిమాలు రీమేక్ అయి హిట్టైన సినిమాలు చాలానే ఉన్నాయి. డబ్బింగ్ రూపంలోనూ టాలీవుడ్ సినిమాలు అక్కడి ప్రేక్షకుల్ని బాగాలే అలరించాయి. అయితే కొంత కాలంగా తెలుగు సినిమాలకు అక్కడ సక్సెస్ రేట్ తగ్గింది. ఈ మధ్య కాలంలో రిలీజ్ అయిన సినిమా ఫలితాలే మేకర్స్ ని కంగారు పెడుతున్నట్లే కనిపిస్తోంది. 'అర్జున్ రెడ్డి' హిందీ లో 'కబీర్ సింగ్' గా రీమేక్ అయి మంచి విజయం సాధించిన సంగతి తెలిసిందే. ముంబైలో అతడితో దొరికిపోయిన తెలుగు హీరోయిన్ అదే నమ్మకంతో ఇక్కడ బ్లాక్ బస్టర్ అయిన చిత్రాలు కొన్ని అక్కడా రీమేక్ అయ్యాయి. కానీ వాటి ఫలితాలు మాత్రం ఏమంత ఆశాజనకంగా కనిపించలేదు. నాని నటించిన 'జెర్సీ'..'బన్నీ' నటించిన 'అల వైకుంఠ పురములో'.. అంతకు ముందు 'హిట్' సినిమాలు హిందీలో రీమేక్ అయ్యాయి. కానీ అక్కడ మాత్రం అంచ నాలు అందుకోవడంలో విఫలమయ్యాయి. ఇప్పుడిదే టెన్షన్ 'బేబి' టీమ్ ని సైతం వెంటాడుతున్నట్లు కనిపిస్తోంది. ఇటీవలే ఈ చిత్రాన్ని బాలీవుడ్ లో రీమేక్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో హీరో..హీరోయిన్..నటీనటులు మారుతున్నారు తప్ప మిగతా టీమ్ అంతా ఇక్కడి వారే. సాయి రాజేష్ దర్శకత్వంలోనే రీమేక్ అవుతోంది. 'కల్ట్ బొమ్మ' అనే టైటిల్ ని కూడా రిజిస్టర్ చేసినట్లు తెలుస్తోంది.



తెలుగులో ఈ సినిమా పెద్ద విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఎలాంటి అంచనాలు లేకుండా చిన్న సినిమా గా రిలీజ్ అయి వంద కోట్లకు పైగా వసూళ్లని సాధించింది. సింగిల్ పీస్ డ్రెస్ లో జగతి మేడం స్టన్నింగ్ దీంతో ఈ సినిమా నిర్మాతలు బాగా లాభపడ్డారు. అదే నమ్మకంతో ఇదే కంటెంట్ ని హిందీకి తీసుకెళ్లి అక్కడా సక్సెస్ అందుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. కానీ తాజా వైఫల్యాలన్నీ 'బేబి' టీమ్ ని కాస్త ఆందోళనకి గురి చేస్తున్నట్లు ఫిలిం సర్కిల్స్ లో టాక్ నడుస్తోంది.

## అందానికే మరో అందం....






## క్రికెట్ మ్యాచ్‌లో అపశ్రుతి..

**బంతి తగిలి పగిలిన ప్లేయర్ మొహం..**

**ధారలా కారిన రక్తం..ఆస్పత్రికి తరలింపు**



జెంటిల్మెన్ గేమ్ గా చెప్పుకునే క్రికెట్ లో అప్పుడప్పుడూ కొన్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. ఒక్కోసారి ఈ ప్రమాదాల తీవ్రత మరీ ఎక్కువగా ఉంటుంది. ఆటగాళ్ల ప్రాణాల మీదకు తీసుకొస్తుంది.ఆస్ట్రేలియా క్రికెటర్ ఫిల్ హ్యూస్ మరణం ఇప్పటికీ క్రికెట్ అభిమానులను వెంటాడుతోంది. తాజాగా అలాంటిదే మరొక ఘటన చోటు చేసుకుంది. ఆస్ట్రేలియాలో జరుగుతున్న దేశవాళీ క్రికెట్ లో ఒక క్రికెటర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఫీల్డింగ్ లో పొరపాటుగా బంతి ముఖానికి తగడడంతో గ్రౌండ్ లోనే రక్తపు వాంతులు చేసుకుంటూ కూలబడిపోయాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్నాయి. మార్ష్ కప్‌లో సౌత్ ఆస్ట్రేలియా, విక్టోరియా మధ్య మ్యాచ్ జరిగింది. వాఆవ ఫార్మాట్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో, దక్షిణ ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేసింది, ఆ తర్వాత లక్ష్యాన్ని ఛేదించే విక్టోరియా ఇన్నింగ్స్ సాగుతున్న సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. 25 ఓవర్ లో రెండో బంతికి విక్టోరియన్ బ్యాటర్ థామస్ రోజర్స్ షాట్ ఆడాడు. బంతి బుల్లెట్ వేగంతో గాల్లోకి లేచింది. సౌత్ ఆస్ట్రేలియా ఫీల్డర్ హెన్రీ హంట్ క్యాచ్ ను అందుకునేందుకు రెడీ అయ్యాడు. అయితే పట్టు తప్పడంతో బంతి నేరుగా ముఖానికి తగిలింది. దీంతో అతని ముఖం పగిలిపోయింది. రక్తం కూడా ధారలా కారింది. తలను పట్టుకుని అలాగే నేలపై కూలబడిపోయాడు.దీంతో జట్టు ఫిజియో, డాక్టర్లు వెంటనే గ్రౌండ్ లోకి పరిగెత్తుకుంటూ వచ్చారు. ప్రాథమిక చికిత్స చేశారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడతో వెంటనే గ్రౌండ్ నుంచి బయటకు తీసుకెళ్లారు. హెన్రీని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారని తెలుస్తోంది. బంతి గట్టిగా తగడంతో ముఖం, ముక్కుకు తీవ్ర గాయాలయ్యాయని అందుకే రక్తం ధారలా కారిపోయిందని ఫిజియో అంటున్నారు. సంఘటన జరిగినప్పుడు, విక్టోరియా బ్యాటర్ థామస్ రోజర్స్ 63 పరుగులతో ఆడుతున్నాడు. అయితే ఈ ప్రమాదం తర్వాత బ్యాటింగ్ పై దృష్టి కోల్పోయాడు రోజర్స్. కేవలం 4 పరుగులు జోడించి అవుటయ్యాడు. ఇక మ్యాచ్ ఫలితాల విషయానికి వస్తే విక్టోరియా 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సౌత్ ఆస్ట్రేలియా నిర్దేశించిన 232 పరుగుల లక్ష్యాన్ని 35 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది.

## విరాట్ కోహ్లీ వర్సెస్ రోహిత్.. ఇద్దరిలో ఎవరు బెస్ట్? స్టార్ పేసర్ షమీ సమాధానమిదే

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ? ఎవరు బెస్ట్? ఈ ప్రశ్న తరచుగా వినిపిస్తుంది. ఈ ప్రశ్నకు కొందరు కింగ్ కోహ్లీ అని, మరికొందరు హిట్ మ్యాన్ అని సమాధానమిసస్తారు.అయితే ఇదే ప్రశ్నను టీమ్ ఇండియా పేసర్ మహమ్మద్ షమిని అడగ్గా తెలివైన సమాధానం చెప్పాడు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మహమ్మద్ షమీకి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ. వీరిలో అత్యుత్తమ బ్యాట్స్‌మెన్ ఎవరు అని ప్రశ్నించారు. ఇద్దరినీ దగ్గరుండి చూసిన షమీకి ఒకరిని ఎంచుకోవడం కష్టమైంది. అందుకే తెలివిగా సమాధానాలు ఇస్తూ ఇద్దరినీ మెచ్చుకున్నాడు షమీ. ఈ ప్రశ్నకు షమీ సమాధానమిస్తూ, విరాట్ కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్. ఇప్పటికే ఎన్నో రికార్డులను బద్దలు కొట్టాడు. అందుకే నేను విరాట్ కోహ్లీని ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్ అని పిలుస్తాను' అని షమీ బదులిచ్చాడు. అదే సమయంలో రోహిత్ శర్మ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్. కాబట్టి నా అభిప్రాయం ప్రకారం, విరాట్ కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్, రోహిత్ శర్మ ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్ ' అని మహ్మద్ షమీ సమాధానమిచ్చాడు. తన తెలివైన సమాధానంతో కింగ్ కోహ్లీ, హిట్‌మ్యాన్‌లలో ఎవరు బెస్ట్ అనే చర్చకు మహ్మద్ షమీ ఫుల్ స్టాప్ పెట్టాడు. ఇప్పుడు షమీ తెలివైన సమాధానానికి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అభిమానుల నుండి కూడా భారీ ప్రశంసలు లభిస్తున్నాయి.చీలమండ గాయం కారణంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌కు మహ్మద్ షమీ దూరమయ్యాడు. వన్డే ప్రపంచకప్ సందర్భంగా షమీ కాలికి గాయమైంది. అయితే ప్రపంచకప్‌లో పెయిన్‌కిల్లర్స్‌తో బరిలోకి దిగాడు. ఇప్పుడు పాదాల నొప్పుల సమస్య తీవ్రంగా ఉండడంతో చికిత్స తీసుకుంటున్నాడు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.